క్లుప్తంగా

1వ తేదీనే పింఛన్ పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని 17 సచివాలయాల పరిధిలోని 33 వార్డుల్లో వలంటీర్లు 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్‌లు, గృహ సారథులు, వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ అందజేశారు. పట్టణంలోని లబ్ధిదారులకు పింఛన్ అందించటం జరిగిందని అధికారులకు తెలియజేశారు.

నేడు భట్రుపాలెం దేవాలయంలో వేలం

దాచేపల్లి : మండలంలోని భట్రుపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో నెమలిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 3వ తేదీ వరకు దేవాలయంలో కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు, విస్తళ్లు, బెల్లం, లడ్డూ ప్రసాదం విక్రయాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, తలనీలాలు సేకరించేందుకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఒక్కోదానికి రూ.5 వేల చొప్పున ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9490951852 నెంబర్‌ను సంప్రదించాలని ఈవో నెమలిరెడ్డి చెప్పారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన



పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్‌నగర్‌లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా పీడీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అత్యంత పాశవికంగా ఉన్నాయని, పసి పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా వేల మంది నిత్యం మృత్యువాత పడుతున్నారన్నారు. అమెరికా అండదండలతో బరితెగించిన ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో గాజా నగరాన్ని ధ్వంసం చేస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితితో 123 దేశాలు దాడులను ఆపాలని డిమాండ్ చేసినా ఆపటం లేదని అన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపటం వెనుక మోదీ ప్రభుత్వం తీరు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పీడీఎం నాయకులు వైవీ షేక్ మస్తాన్‌వలి, భారత్ బచావో పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.కోట నాయక్, సీపీఎం పార్టీ అధ్యక్షులు తెలగపల్లి శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణనాయక్, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షులు ఓర్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సత్తెనపల్లి: ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులను ప్రోత్సహించేందుకే జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా ఇన్‌చార్జ్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామారావు అన్నారు. పట్టణంలోని పశు వైద్యశాలలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, అమరావతి, పెదకూరపాడు, రాజుపాలెం, క్రోసూరు, అచ్చంపేట మండలాల పరిధిలో గల సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు, పారా సిబ్బంది, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు, గోపాల మిత్రులకు బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతికి జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో 2021–22 నుంచి 2025–26 సంవత్సరాల కాలపరిమితిలో రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల గురించి వివరించారు. సమావేశంలో డాక్టర్ నరసింహులు, డాక్టర్ మంగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

ప్రజా రక్షణ యాత్రలో సీపీఎం జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

నకరికల్లు: తెలుగు ప్రజల త్యాగ ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రక్షణ యాత్రలో భాగంగా చేపడుతున్న బస్సుయాత్ర ఈనెల 7వ తేదీన సత్తెనపల్లి చేరుకుంటుందన్నారు. పల్నాడు ప్రాంతంలో సాగర్ జలాలు లేకపోవడం వలన సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రూపొందించిన 30 డిమాండ్‌లతో కూడిన ప్రజా ప్రణాళికకు మద్దతు ఇవ్వాలని గ్రామాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.లక్ష్మేశ్వరరెడ్డి, డి.శివకుమారి, షేక్ సీలార్, టి.రెడ్డిరాజు, ఈవూరి లక్ష్మారెడ్డి, జి.పిచ్చారావు, ఈవూరి అప్పిరెడ్డి, సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అమరజీవి

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దుర్గి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రం దుర్గి సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ భాషా సంయుక్త రాష్ట్రాలుగా ఏర్పడాలని డిమాండ్ చేస్తూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ అసువులు బాసారన్నారు. దేశంలో భాషా ప్రామాణికంగా ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్రరాష్ట్రమన్నారు. పొట్టి శ్రీరాములు దీక్ష ఫలితంగా నాడు కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కపలవాయి శ్రీనివాసరావు, చలవాది సత్యనారాయణ, దాల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి వెంకటప్పయ్య, మాజీ సర్పంచి ఎల్లబోయిన గోపాలు, ఆర్యవైశ్య సంఘం నేతలు పరుచూరి నాగేశ్వరరావు, అప్పారావు, కపలవాయి సాంబయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

మాచర్ల: పట్టణంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. స్వర్గీయ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షతో రాష్ట్రం నవంబర్ 1న ఏర్పడటం ఎంతో సంతోషకరమని పలువురు ఆర్యవైశ్య నాయకులు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షులు కంభంపాటి అమర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ సెంటర్, కోదండరామాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘ నాయకులు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు మాచర్ల క్లబ్‌ల ఆధ్వర్యంలో విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆర్యవైశ్య సంఘ నాయకులు వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, కజ్జం గురవయ్య, కొత్తమాసు బ్రహ్మారావు, మేడా వెంకట లక్ష్మి, కొత్తమాసు పాండురంగారావు, విడేల శ్రీనివాసరావు, జీవీకేఎస్ ప్రసాద్, మారం వాసు, రంగా చెన్నయ్య తదితరులున్నారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం
ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు అక్కేశ్వరరావు



దుర్గిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు మాచర్ల క్లబ్‌ల ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

గురజాల : ఎంతో మంది మహనీయుల త్యాగఫలమే మనం అనుభవించే స్వాతంత్ర్య ఫలాలు అని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు అక్కేశ్వరరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్ముని, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, పెనుగొండ అమృతలింగేశ్వరరావు, బచ్చు వెంకటేశ్వర్లు, ఆకుల పిచ్చయ్య గుప్తా, కాకుమాను సుబ్రహ్మణ్యం, పంతంగి సుబ్బారావు, చింతా ప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులున్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు, విద్యా శాఖ రాష్ట్ర డైరెక్టర్ చింతా వెంకట రామారావు, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు గుండా రామారావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కట్టమూరి శంకరరావు, అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కొత్త రఘురామయ్య, సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు చందోలు శివ కృష్ణారావు, దేవస్థానం మాజీ అధ్యక్షులు జూలకంటి సుబ్రహ్మణ్యం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చేదేళ్ల కృష్ణ, వాసవీ కల్యాణ మండపం అధ్యక్షులు వై.సైదారావు, గోంట్ల శ్రీనివాసరావు, కట్టమూరి ఉమామహేశ్వరరావు, ఆలేటి కనకయ్య, బండి శ్రీనివాసరావు, కనిగిరి శ్రీనివాసరావు, హరినారాయణ, బుచ్చిబాబు, సుబ్రహ్మణ్యం, సాయి, చంద్రం, కోటి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పార్టీలో చేరిన టీడీపీ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటానని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో జెట్టిపాలెం గ్రామానికి చెందిన 5 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరగా వారికి పీఆర్కే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న 2024 సార్వత్రిక ఎన్నికలలో మరోసారి ప్రతి ఒక్కరు చల్లని ఆశీస్సులు అందచేసి అండగా ఉండాలన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలలోని పేదలకు జరుగుతున్న మేలును చూసి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటానన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కుందురు పేర్రెడ్డి, కొండా రామయ్య, తిక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన మున్నా పాపయ్య, కామనబోయిన శ్రీనివాసరావు, కామనబోయిన బ్రహ్మయ్య, కామనబోయిన చిన్న శ్రీనివాసరావు, కామనబోయిన చౌడయ్య కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య తదితరులున్నారు.

మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి చూడండి

ప్రభుత్వ విప్ పీఆర్కే



ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లను సన్మానిస్తున్న జిల్లా, వివిధ మండలాల సచివాలయ జేఏసీ కన్వీనర్లు

మాచర్ల: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అతి తక్కువ కాలంలో అభివృద్ధి చేసి కోట్ల మందికి ప్రయోజనం చేకూరుస్తున్న నేపథ్యంలో మళ్లీ జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని దిగ్విజయంగా క్షేత్రస్థాయి నుంచి విస్తృతంగా ప్రచారం చేసి 2024లో అధికారంలోకి మళ్లీ జగన్‌ను తీసుకొచ్చేందుకు అన్ని గ్రామాలలో ఇంటింటికి తిరిగి జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్‌లోని వీవీఎస్ గార్డెన్స్‌లో జరిగిన సభలో వేలాది మందితో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ నేపథ్యంలో ప్రతీ ప్రజానాయకుడు, పార్టీ నాయకులు, మండల నాయకులు ఎటువంటి పరిస్థితిలో రాజీ పడకుండా షెడ్యూలు ప్రకారం ఈ నాలుగు నెలలు కష్టపడి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చి గర్వంగా తలెత్తుకొని ప్రజలకు సేవ చేయటంలో ముందుభాగంలో ఉండాలన్నారు. అందులో భాగంగానే నేను కింద స్థాయి నుంచి నాయకుడిగా ఎదిగానన్నారు. నాకు రాజకీయాల్లోకి రావాలని కోరిక లేకపోయినా బాబాయి స్వర్గీయ సుందరరామిరెడ్డి స్ఫూర్తితో, స్వర్గీయ పిన్నెల్లి లక్ష్మారెడ్డి ఆశీస్సులతో జెడ్పీటీసీ అయి, స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో గెలిచినా నేనెప్పుడూ ఏ కార్యకర్త, నాయకుడిని మరచిపోలేదన్నారు. 2019లో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే వరికపూడిసెల తీసుకొస్తానని హామీనిచ్చాను. త్వరలోనే సీఎం జగన్ వరికపూడిసెలకు శంకుస్థాపన చేస్తారన్నారు.

మాచర్ల నియోజక వర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. సాగర్ నుంచి దావుపల్లి, మాచర్ల నుంచి దాచేపల్లి హైవే, మాచర్ల మంచినీటి కోసం రూ.50 కోట్లతో శంకుస్థాపన జరిగిందన్నారు. రూ.1,600 కోట్లు వరికపూడిసెలకు నిధులు ఇచ్చారు. పార్టీని మళ్ళీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేయండి. నేను అండగా నిలబడతా. ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం చేస్తా. జగనన్న మళ్లీ ఎందుకు సీఎం కావాలనే కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో మీ అందరి సహకారం కోరుతూ 3వ తేదీన జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన జోనల్ విభాగ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల నాయకుడు జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కీలకపాత్ర అందరూ ముందంజలో ఉండాలని కోరారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు రాష్ట్రాన్ని, నియోజకవర్గంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించి మాచర్ల నియోజకవర్గాన్ని కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించగా మార్కెట్ యార్డు చైర్మన్‌లు తాడి వెంకటేశ్వరరెడ్డి, వెలిదండి గోపాల్, ఎంపీపీలు దాసరి చౌడేశ్వరి, ఏనూరి సాయి శంకర్, చింతా ఆదినారాయణ, బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు షేక్ షఫీ, పెద మల్లుస్వామి, జిల్లా జేసీఎస్ అధ్యక్షులు ఉమామహేశ్వరరెడ్డి, కన్వీనర్ మాతా సరోవర్ వీరారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు కామనబోయిన కోటయ్య, ఉప్పలపాటి జాని, బూదాల మరియమ్మ, ఐదు మండలాల కన్వీనర్లు, మండలాధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, అనుబంధాల సంఘ నాయకులు, ఐదు వేల మంది సమావేశంలో పాల్గొని జగన్‌కు, పీఆర్కేకు జేజేలు పలుకుతూ జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేపట్టారు.

క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ



భవిష్య పాఠశాలలో డీఎస్పీ ఆదినారాయణకు మెమెంటో అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీధర్

సత్తెనపల్లి: క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని భవిష్య పాఠశాలలో వార్షిక క్రీడా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని గమనించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ఆటలు ఆడటం వల్ల ఏకాగ్రత, ఓర్పు, నైపుణ్యం అన్నీ అలవాడతాయన్నారు. విద్యార్థులు నిత్యం ఒక గంటపాటు సైక్లింగ్, వాకింగ్, యోగా వంటివి చేసి శారీరకంగా దృఢంగా తయారవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో కొంతమంది స్వతహాగా నైపుణ్యాన్ని కలిగి ఉంటారన్నారు. అలాంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ లయన్ ఐ.శ్రీధర్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరకంగానే కాక మానసికంగా కూడా వృద్ధి చెందుతారన్నారు. క్రీడల వల్ల జ్ఞాపకశక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఐ.ఉమాకళ్యాణి, పీఈటీ సుదర్శన్‌రావు, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ దరియా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర పరీక్షల సర్వే



రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలో ఇటీవల జ్వరాలు ఎక్కువగా నమోదు కావడంతో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి జ్వర పరీక్షల సర్వేను బుధవారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఆరు టీమ్‌లుగా ఏర్పడి జయంతీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లోను, గ్రామంలోను జ్వర పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి జ్వరాలు నమోదు అయినట్లు వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయగా నెగిటివ్‌గా నమోదు అయినట్లు డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, సీహెచ్‌వో జ్యోత్స్న, హన్నాకుమారి, శివమాధురి, హెల్త్ అసిస్టెంట్‌లు హుస్సేన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని స్థాపిద్దాం

చైతన్య గోదావరి బ్యాంక్ విజిలెన్స్ అధికారి ఇ.రాంబాబు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దాచేపల్లి : అవినీతి రహిత సమాజం స్థాపిద్దామని చైతన్య గోదావరి బ్యాంక్ విజిలెన్స్ అధికారి ఇ.రాంబాబు అన్నారు. మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం–2023 బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. వ్యాస రచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి రాంబాబు మాట్లాడుతూ..మనిషి మనుగడ ప్రశాంతంగా ఉండాలంటే అవినీతి లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశంలో అవినీతిని వ్యతిరేకించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, చిన్నతనం నుంచే విద్యార్థులకు నీతిగా జీవించేలా నేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఎస్.విజయ్‌కుమార్, రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బ్యాంక్ మేనేజర్ వి.వి.ప్రసాద్, హెచ్‌ఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ



శనగ విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ పి.కోటయ్య

ఊటుకూరు(క్రోసూరు): ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తున్న శనగ విత్తనాలను మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఎంపీపీ పి.కోటయ్య, వ్యవసాయాధికారులు రైతులకు బుధవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.13,500 వారి ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందన్నారు. కౌలు రైతుల, రైతులకు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం, ఉచిత బీమా తదితర కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ రైతులకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. శనగ విత్తనాల ధర రూ.81 ఉండగా సబ్సిడీ రూ.32.40 పోను రైతులు కేవలం రూ.48.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి పొలం పాస్‌పుస్తకం ,ఆధార్ నంబర్ ద్వారా విత్తనాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ జెర్రిపోతు బుచ్చయ్య, జొన్నవరపు శ్రీనివాసరెడ్డి, అల్లురెడ్డి, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సత్తెనపల్లి: పట్టణంలోని 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వార్డు కౌన్సిలర్ లోక కళ్యాణి బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలతో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తుందని, ప్రతి గర్భిణీ మహిళ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భారతి, మహిళా పోలీస్ భవాని కుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు లోక మాధవ ఉన్నారు.

అందరికీ బ్లడ్‌గ్రూపు ఏమిటో తెలిసుండాలి



రక్తగ్రూపు పరీక్షించుకున్న బాలికకు కార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మీ బ్లడ్ గ్రూపు తెలుసుకోండి (నో యువర్ బ్లడ్ గ్రూపు) అనే పేరుతో కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బ్లడ్ గ్రూపింగ్ విధానం పరిశీలించి ఎస్పీ, జేసీతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వారి బ్లడ్ గ్రూప్‌లను పరీక్షించుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రక్తం ఏ గ్రూపుకు చెందినదో తెలుసుకొని ఉండటం చాలా అవసరమన్నారు. బ్లడ్‌గ్రూప్ తెలియని వారికి గ్రూప్ నిర్ధారించి వారి వివరాలను రికార్డ్ చేసి కార్డులు అందజేస్తారన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి గ్రామం, మండలం, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు, సామాన్య ప్రజలకు కూడా పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ మీ ప్రాంతాలలో నిర్వహించాలని అనుకుంటే 9100078576కి కాల్‌చేసి సంప్రదించాలని కోరారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ పీవీఎం శరత్ బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, డాక్టర్ రహమతుల్లా, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, జిల్లా అధికారులు, వలంటీర్స్ పాల్గొన్నారు.

వందశాతం కచ్చితత్వం ఉండాలి

యడ్లపాడు: తాజాగా ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి తుదిజాబితా వందశాతం కచ్చితంగా ఉండేలా బీఎల్‌ఓలు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వసంతబాబు చెప్పారు. యడ్లపాడు–2 గ్రామ సచివాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆయన మాట్లాడుతూ గతంలో ఓటర్లు ఇచ్చిన క్లెయిమ్‌లను ఇంటింటి సర్వేలో పరిశీలన చేసి పంపిన మేరకు జాబితాలో మార్పులు జరిగాయా ? లేదా ? అన్న విషయాలను తనిఖీ చేయాలని చెప్పారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం బాలికలు

శావల్యాపురం: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో 10 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు శావల్యాపురం హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ విభాగంలో 10 మంది బాలికలు గత నెల 28న గవర్నమెంటు ఉర్దూ బాయ్స్ హైస్కూలు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ గేమ్ నందు బాలికల విభాగంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో ప్రథమస్థానం సాధించటంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్–14 విభాగంలో టి.అంజన, ఆర్.రత్నకీర్తన, శ్రీహర్షత, రవళి, లలితా, అండర్–17 విభాగంలో ఆకుమళ్ళ సమీరా, కె.కావ్య, యం.లూధియా, వేముల దివ్య, ఉప్పు బసవరాణిలు ఎంపికైనారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు 4 నుంచి 6 వరకు పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా అత్మకూరు జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఎంపికైనా బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, అబ్దుల్లా, భువనేశ్వరీ, నిర్మల, ఆదాంఖాన్, శ్రీకృష్ణ, రవి, శ్రీకాంత్ అభినందించారు.

ప్రభుత్వ హాస్టళ్లలో నూతనసదుపాయాలు ప్రారంభం

నరసరావుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్, ఆనందనిలయం హాస్టల్‌లో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను దాత రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి జూపూడి ప్రసాదు బుధవారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరయ్యారు. ఈ రెండు హాస్టళ్లలో జూపూడి ప్రసాద్ తన తల్లితండ్రులు డేవిడ్, నాగమ్మల జ్ఞాపకార్థం వారిపేర్లపై రూ.4 లక్షలతో వాటర్ ప్లాంట్, రెండు సింటెక్స్ ట్యాంకులు, పైపులు, రెండు హాస్టళ్లకు రంగులు వేయించారు. వీటిని జేసీ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఓబులు నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.